

గతంలో తగరపువలస కూడలికి వచ్చేందుకు వెంకటేశ్వరమెట్ట వద్ద అనువుగా ఉన్న మార్గం

నాడు

జాతీయ రహదారుల విస్తరణ తగరపువలస వాసులకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులను దూరం చేసేసింది. గ్రామంలోకి ప్రవేశించే సర్వీస్ రోడ్డును కూడా మూసివేశారు. దీంతో 2 కి.మీ. దూరం నడవాల్సిన పరిస్థితి. తీరా అంత ప్రయాసపడి వెంకటేశ్వరమెట్ట/సంగివలస వరకు వెళ్లినా అక్కడ షెల్టర్ లేక రోడ్డు మీద ఎండావానల్లో నిరీక్షించాల్సిందే..



వెంకటేశ్వరమెట్ట వద్ద విశాఖ వెళ్లే సర్వీస్ రోడ్డును మూసివేసిన దృశ్యం

నేడు

ఆర్టీసీ బస్సును అందుకోలేం

- వెంకటేశ్వర మెట్ట వద్ద మూసివేసిన సర్వీస్ రోడ్డు
- ఫ్లై ఓవర్ పైనుంచి వెళ్లిపోతున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసులు
- తగరపువలస వాసులకు భారమైన రవాణా

తగరపువలస: భీమిలి నియోజకవర్గానికి ప్రధాన కేంద్రమైన తగరపువలస నుంచి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుకోవడం ఇక్కడి ప్రయాణికులకు కష్టతరమవుతోంది. పూర్వం ఉత్తరాంధ్రలో రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులన్నీ తగరపువలసలోని అంబేడ్కర్ కూడలి మీదుగా నడిచేవి. ఇందుకు వెంకటేశ్వరమెట్ట, సంగివలస ప్రాంతాల నుంచి కూడలికి చేరుకోవడానికి అనువైన మార్గాలు ఉండేవి. ప్రైవేట్ మార్కెట్ కారణంగా అంబేడ్కర్ కూడలి నుంచి ప్రధాన మార్గం ఇరుకుగా మారిపోవడంతో తరువాత కాలంలో చిట్టివలస ఈఎస్‌ఐ ఆస్పత్రి కూడలి వద్ద ఇరువైపులా బస్సులు అందుబాటులో ఉండేవి. ఆరేళ్ల క్రితం జాతీయ రహదారుల విస్తరణ సమయం నుంచి స్థానికులకు ఆర్టీసీ బస్సు దూరమైపోయింది. దూరప్రాంతాలకు ప్రయాణించేవారు ఎక్స్‌ప్రెస్



గతంలో ఉత్తరాంధ్ర నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలిచిన ఈఎస్‌ఐ కూడలి

బస్సులు అందుకోవాలంటే జాతీయ రహదారిపై వెంకటేశ్వరమెట్ట, లేదా సంగివలస వరకు కాళ్లీడ్చుకుంటూ వెళ్లి ఎండనక, వాననక బస్సుల కోసం ఎదురు చూడవలసిందే. అక్కడ కూడా ప్రమాదకరమైన పరిస్థితులు ఎదురవుతుంటాయి. ఇక చీకటి పడితే ఎక్స్‌ప్రెస్ బస్సులపై ప్రయాణం నరకప్రాయమే.

సిటీ సర్వీసులు కూడా కొన్ని మాత్రమే..

ప్రస్తుతం తగరపువలస కూడలి మీదుగా కొన్ని సిటీ సర్వీసులు మాత్రమే నడుస్తున్నాయి. మిగిలిన బస్సులన్నీ హైవే పై నుంచే వెళ్లిపోతున్నాయి. అందరికీ అందుబాటులో ఉండే అంబేడ్కర్ కూడలిలో ఎలాంటి వసతులు లేకపోగా బంగ్లామెట్ట, చిట్టివలస ఈఎస్‌ఐ కూడలి శివారులో ఉన్నాయి.

వెంకటేశ్వరమెట్ట వద్ద సర్వీస్ రోడ్డు తెరవాలి

ఉత్తరాంధ్రలో ప్రయాణించే బస్సులన్నీ వెంకటేశ్వరమెట్ట, బంగ్లామెట్ట నుంచి తగరపువలస కూడలి మీదుగా లేదంటే వెంకటేశ్వర మెట్ట వద్ద మూసి ఉన్న సర్వీస్‌రోడ్డును తెరచి చిట్టివలస ఈఎస్‌ఐ ఆస్పత్రి పక్కనుంచి నడపాలని స్థానికులు కోరుతున్నారు. తగరపువలస వద్ద ఫ్లై ఓవర్ల నిర్మాణం కారణంగా ఇక్కడి ప్రజలలో బస్సుకు దూరమైన భావన నెలకొంది. అంతేకాకుండా ఈ ప్రాంతానికి ప్రాధాన్యం కూడా తగ్గిపోయింది. దీంతో తప్పనిసరి పరిస్థితులలో స్థానికులు పల్లెవెలుగు, సిటీ బస్సులలో విశాఖ, విజయనగరం వెళ్లి, అక్కడి నుంచి ఉత్తరాంధ్రలో ముఖ్యమైన ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోంది. అధికారులు స్పందించి తగరపువలస చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మించాలని, దానిమీదుగా బస్సుల రాకపోకలు సాగేలా చూడాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అంబేడ్కర్ కూడలిలో ప్రయాణికులకు ఎలాంటి షెల్టర్ లేని దృశ్యం

జీవీఎంసీ పరిధిలో బస్సును దూరం చేశారు



జీవీఎంసీ ఒకటోవార్డు తగరపువలస నుంచే ప్రారంభం అవుతుంది. అలాంటిది ఇక్కడి వారు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్‌లు ఎక్కాలంటే రెండు కిలోమీటర్లు నడవాలి. చాలావరకు సిటీ బస్సులు కూడా బైపాస్ మీదుగానే వెళ్లిపోతాయి. రూరల్ పరిధిలో ఉన్న ఆనందపురం వాసులకు మాత్రం విచిత్రంగా అంతర రాష్ట్ర బస్సు సర్వీసులు కూడా గ్రామం మధ్య నుంచి నడుస్తాయి.

– బొడ్డు నరసింగరావు, తగరపువలస

కూడలి మీదుగా నడపాలి



ఉత్తరాంధ్రలో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో చాలావరకు తగరపువలస మీదుగా 24 గంటలూ నడుస్తాయి. అందువలన ప్రైవేట్ బస్సులు కాకుండా ఆర్టీసీ బస్సులు తగరపువలస ఊరిలోపల నుంచి నడిస్తే ప్రయాణికులకు రాత్రయినా, అపరాత్రయినా పరవాలేదు. దీని కోసం తగరపువలస చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మించాలి.

– నీలాపు సురేష్‌రెడ్డి, సంతపేట

అభివృద్ధి అంటూ రవాణా దూరం చేసేశారు



రహదారులు అభివృద్ధి చెందని రోజుల్లో అన్నిరకాల బస్సులు తగరపువలస లోపలి నుంచి వెళ్లేవి. ఇప్పుడు అభివృద్ధి పెరిగి రవాణా దూరం అయింది. అధికారులు స్పందించాలి. స్థానికులకు బస్సులు అందుబాటులో ఉండేలా తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించాలి. ప్రస్తుతం బస్సులు దూరం కావడంతో ఆటోలను ఆశ్రయించి ప్రమాదాల బారిన పడుతున్నారు.

– గుజ్జు సూరిబాబు, చిట్టివలస

క్లుప్తంగా

సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలి



రెడ్డిపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయ్‌కుమార్

పద్మనాభం: సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి, రేవిడి, కోరాడ, బి.ఆర్.తాళ్లవలస పంచాయతీల్లో సోమవారం పర్యటించిన ఆయన సర్వేలను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ పీ–4, వర్కు ఫ్రమ్ హోం, ఎంఎస్ఎంఈ వంటి సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

జాబ్‌మేళాలో 31 మంది ఎంపిక



మాట్లాడుతున్న స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్

భీమునిపట్నం: భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా అధికారి చాముండేశ్వరరావు పర్యవేక్షణలో సోమవారం జరిగిన జాబ్ మేళాలో 31మంది ఎంపికయ్యారు. ఇందులో నాలుగు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వాటిలో ఉద్యోగావకాశాలను స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ అన్నపూర్ణ వివరించారు. మేళాలో 138 మంది పాల్గొనగా, వారిలో 31మంది ఎంపికయ్యారు.

ముగ్గురమ్మ వార్ల ఆలయంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో ఈవో సురేష్‌బాబా

తగరపువలస: జాతీయరహదారి వద్ద సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన మహా అన్నదానాన్ని ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 8వేల మంది భక్తులు పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ సిబ్బంది తాటికొండ రాంబాబు, కోరాడ శ్రీను పాల్గొన్నారు.


బంగారమ్మ ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం: మండలంలోని తునివలసలో బంగారమ్మ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా రాత్రి అమ్మవారి రథాలను గ్రామంలో ఊరేగించారు. రెండు వ్యవసాయ బళ్లను రథాలుగా తీర్చిదిద్ది, గ్రామంలో ఊరేగించారు. అమ్మవారి ఆలయం, పరిసరాలు విద్యుద్దీపాలతో వెలుగొందాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పీఎం పాలెం: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందారు. స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. గాయత్రి ఆస్పత్రి ఎదురుగా జాతీయ రహదారికి సమీపంలో ఓ వ్యక్తి మరణించి ఉన్నాడని పోలీసులకు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించిన పోలీసులు బ్లూ బనియన్, హాఫ్ ప్యాంట్ వేసుకున్న ఓ వ్యక్తి (60) మృతి చెంది ఉండటం గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

యువకుడి ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం పందలపాక పంచాయతీ బాకూరుపాలెం గ్రామానికి చెందిన పలికెల రమేష్(25) ఆదివారం సాయంత్రం కల్లంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిస అయిన రమేష్ మద్యం కొనడానికి తండ్రిని డబ్బులు అడగడంతో, ఇద్దరి మధ్య వివాదం జరిగింది. దీంతో పొలానికి వెళ్తానని చెప్పి బయటకు వచ్చి కల్లంలో ఉరిపోసుకున్నాడు. అతని బంధువులు గమనించి రక్షించే ప్రయత్నం చేసి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అప్పటికే మృతి చెందినట్టు సిబ్బంది తెలిపారు. దీంతో పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని భార్య బోని భారతి ఫిర్యాదు మేరకు ఆత్మహత్యకు గల కారణాలపై ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుచితంగా ప్రవర్తిస్తే ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న జడ్జి మూర్తి

భీమునిపట్నం: బాలికలు, మహిళలను వేధిస్తే కఠిన శిక్షలు అమలవుతాయని సీబీఐ ప్రత్యేక కోర్టు ప్రధాన న్యాయమూర్తి సి.ఎస్.మూర్తి తెలిపారు. తమపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే భయపడవద్దని, వెంటనే తల్లిదండ్రులకు తెలియజేసి, పోలీసులకు ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. వేధింపు చట్టాలపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థినులకు పలు చట్టాల గురించి తెలియజేశారు. సాధారణ వేధింపులతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడేవారు కఠిన శిక్షలకు గురవుతారన్నారు. పోక్సో చట్టం ఎంతో శక్తివంతమైందని తెలిపారు. ఎవరైనా ఇబ్బంది పెడితే జాప్యం చేయకుండా స్పందించాలన్నారు. ఇటువంటి వాటిపై అధ్యాపకులు కూడా అవగాహన కల్పించాలని, ధైర్యం చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, సీఐ తిరుమలరావు పాల్గొన్నారు.

సన్యాసినాయుడి ఎన్నికపై హర్షం



ఆపస్ జిల్లా కోశాధికారి సన్యాసినాయుడు

పద్మనాభం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) జిల్లా కోశాధికారిగా పద్మనాభం మండలం కోరాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కనకల సన్యాసినాయుడు ఎన్నిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సన్యాసినాయుడికి ఆపస్ జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కాళ్ల గోపినాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మామిడి కరుణ్ కుమార్, ఎంజేఎస్ నారాయణరావు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నేడు

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలియజేశారు.

పాఠశాలల విలీనంతో విద్యార్థులకు ఇబ్బంది

- సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు
- విలీనాన్ని వ్యతిరేకించిన మెజారిటీ సభ్యులు



మాట్లాడుతున్న ఎంఈవో శివరాణి

భీమునిపట్నం: భీమిలి పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం ప్రతిపాదనపై మెజారిటీ సభ్యులు తమ వ్యతిరేకతను తెలియజేశారు. ప్రాథమిక పాఠశాలల విలీన ప్రతిపాదనకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దంతులూరి వాసురాజు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పలువురు సభ్యులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపిల్లలకు సదుపాయంగా ఉంటుందని ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశారని, వీటిని ఇప్పుడు మూసేస్తే పిల్లలు దూరప్రాంతాల పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బంది పడతారని తెలిపారు. ఈ పాఠశాలలను మూసివేయకుండా, కొనసాగించాలని కోరారు. సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు శివరాణి, జయప్రద పాల్గొన్నారు.

శంభువానిపాలెం అభివృద్ధికి కృషి



గిరిజన పిల్లలకు పుస్తకాలు, పలకలు అందజేస్తున్న అటవీశాఖ అధికారి శ్రీరామ్ నరేష్

పీఎం పాలెం: కంబాల కొండ అభయారణ్యంలోని గిరిజన గ్రామం శంభువానిపాలెం అభివృద్ధికి అటవీశాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని స్థానిక ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీరామ్ నరేష్ బిర్లంగి అన్నారు. పీఎం పాలెం చేరువలోని ఈ గిరిజన గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆయన సోమవారం పలకలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. విశాఖపట్నం రోటరీ క్లబ్ సెక్రటరీ మణిమాల సహకారంతో గ్రామంలో మూడు నెలలపాటు కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కుట్టుమిషన్ టీచర్ పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

పద్మనాభం: మండలంలోని లింగన్నపేటలో మూడు రోజుల నుంచి జరుగుతున్న సిద్ధి వినాయక, సుబ్రహ్మణ్యస్వామి సహిత అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ముందుగా ధాన్యాధివాసం, మండప పూజలు, గోపూజ వంటి పూజలు నిర్వహించారు. తదుపరి విగ్రహాలను ప్రతిష్టించి, భక్తులకు ఆలయ ప్రవేశం కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిడతలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బుడ్డివలస–అగ్రహారం సర్పంచ్ పిన్నింటి సూర్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పి.సందీప్, పి.శ్రీను, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తొలి పరీక్ష ప్రశాంతం

- పది పరీక్షలు ప్రారంభం
- 46 కేంద్రాల్లో 9,593 మంది హాజరు



చిట్టివలస శారద స్కూల్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు



రెడ్డిపల్లి పరీక్ష కేంద్రం వద్ద లోపలికి వెళ్లడానికి గేటు వద్ద వేచి ఉన్న విద్యార్థులు

తగరపువలస: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పదో తరగతి సాధారణ, ఓపెన్ పరీక్షలు భీమిలి నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి 46 పరీక్షా కేంద్రాలలో 9712 మంది విద్యార్థులకు గాను 9593 హాజరయ్యారు. వీరిలో భీమిలి నుంచి 14 కేంద్రాలలో 2858 మందికి గాను 2846 మంది, పద్మనాభం మండలంలో 4 పరీక్షా కేంద్రాలలో 710 మందికి గాను 709 మంది హాజరయ్యారు. ఆనందపురం మండలంలో 5 పరీక్షా కేంద్రాలలో1109 మందికి గాను 1106 మంది, చినగదిలి మండలం మధురవాడ డివిజన్‌లో 22 పరీక్షా కేంద్రాలలో 5035 మందికి గాను 4932 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. భీమిలిలో పరీక్షల పరిశీలకునిగా ఎంఈవో రవీంద్రబాబు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

చంద్రంపాలెం హైస్కూల్లో..

మధురవాడ: చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో ఐదుగురు గైర్హాజరయ్యారు. మొదటి సెంటర్‌లో 265 మందికి గాను 262 హాజరు కాగా ముగ్గురు పరీక్షకు రాలేదని చంద్రంపాలెం హైస్కూల్ హెచ్‌ఎం జి.రవి తెలిపారు. రెండో సెంటర్‌లో 310 మందికి 308 హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారని ఇన్‌చార్జి నారాయణరావు తెలిపారు.

భీమిలిలో..

భీమునిపట్నం: భీమిలి జోన్, మండల పరిధిలోని 14 పరీక్ష కేంద్రాల్లో 2,853 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరయ్యారు.

పద్మనాభంలో ఒకరు గైర్హాజరు

పద్మనాభం: మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో సోమవారం జరిగిన పరీక్షలకు 710 మందికి 709 మంది హాజరయ్యారు. ఒకరు గైర్హాజయ్యారు. ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 180 మందికి 179 మంది, రెడ్డిపల్లి కేంద్రంలో 169 మందికి 169, మద్దిలో 146 మందికి 146, పద్మనాభంలో 215 మందికి అందరూ హాజరయ్యారు.



చంద్రంపాలెం హైస్కూల్లోని పరీక్ష కేంద్రం వద్ద నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



ఆనందపురం జెడ్పీహైస్కూల్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు



భీమిలి సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల వద్ద పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



చంద్రంపాలెం హైస్కూల్ వద్ద వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు

పీజీఆర్‌ఎస్‌లో టీడీపీ నాయకుడి రుబాబు

- అర్జీదారులతో జెడ్సీ చాంబర్‌లోనే వాగ్వాదం
- జోన్–2లో 22 దరఖాస్తులు



మధురవాడలో జెడ్సీ చాంబర్‌లో అర్జీదారులతో టీడీపీ నాయకుడి వాగ్వాదం



జెడ్సీ కనక మహాలక్ష్మికి సమస్య వివరిస్తున్న పీఎం పాలెం వాసులు

మధురవాడ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ను టీడీపీ నాయకులు తమ అడ్డాగా మార్చుకుంటున్నారు. కొందరు తమ వ్యక్తిగత వ్యవహారాల కోసం అధికారుల మీద ఒత్తిడి తీసుకువస్తుండటంతో పాటు అర్జీదారులపై బెదిరింపులకు దిగుతున్నారు. మధురవాడలోని జీవీఎంసీ జోన్–2 కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఎదురుగానే టీడీపీకి చెందిన చోటా నాయకుడు అర్జీదారులతో వాగ్వాదానికి దిగడమే ఇందుకు నిదర్శనం.. వివరాలివి.. జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జెడ్సీ కనకమహాలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జీవీఎంసీ 8వ వార్డు బింద్రానగర్ పార్కులో ఆక్రమణలు తొలగించాలని అర్జీదారుడు సాగర్ తదితరులు జెడ్సీ దృష్టికి తీసుకువచ్చారు. ఏళ్ల తరబడి తిరుగుతున్నామని.. కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్ వంటి ఉన్నత స్థాయి అధికారులు కూడా ఆక్రమణ తొలగించమని చెప్పినా ఏసీపీ, టీపీవో తదితర అధికారులు తాత్సారం చేస్తున్నారని తెలిపారు. సదరు ఆక్రమణదారులు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో టీడీపీ నాయకుడు కలగజేసుకుని, ఎవరు కొడుతున్నారంటూ అర్జీదారుతో వాగ్వాదానికి దిగాడు. సంబంధం లేని విషయంలో జోక్యం ఎందుకని మిగిలినవారు సర్దిచెబుతున్నా వినలేదు. ఇంత వాగ్వాదం జరుగుతున్నా అధికారులు ప్రేక్షకపాత్ర వహించారు. దీంతో అర్జీదారులు జెడ్సీకి దరఖాస్తు అందించి వెనుదిరిగారు.

9 వార్డుల నుంచి 22 అర్జీలు

జోన్ పరిధిలోని మధురవాడ, సాగర్‌నగర్, ఎండాడ, ఆరిలోవ తదితర 9 వార్డుల నుంచి పలు సమస్యలుపై 22 అర్జీలు అందాయి. వీటిపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ కనకమహాలక్ష్మి తెలిపారు. కాగా.. పీజీఆర్ఎస్‌కు హెచ్‌వోడీల డుమ్మాపై వివరణ కోరగా సంస్థాపరమైన చర్యలు చేపడతామని ఆమె చెప్పారు.

జోన్–1లో 11వినతులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ ప్రేమప్రసన్న వాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 11 వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఏడు, పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి నాలుగు వినతులు వచ్చాయి. వీటిని పరిశీలించి త్వరగా పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

మేధావులను స్ఫూర్తిగా తీసుకోవాలి

పీఎం పాలెం: ప్రపంచానికే స్ఫూర్తిప్రదాతలుగా నిలిచిన మన మేధావుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు తమను తాము ఉద్ధరించుకోవాలని బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ పోలీస్ కమాండెంట్ కేవీ. మురళీకృష్ణ అన్నారు. స్థానిక బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (బిట్స్) ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్నోవాల్ట్ పేరిట సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం రచించిన ఎన్నో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అటువంటి పుస్తకాలు చదివి, ఉన్నత వ్యక్తిత్వం అలవరచుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పూర్ణ సత్యనారాయణ, కన్వీనర్ అండ్ హెడ్ కె. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు ప్రేమ్ సాగర్ తదితరులు ప్రసంగించారు.

మానసిక స్థితి బాగా లేని ఇద్దరు అదృశ్యం



బంగార్రాజు

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో మానసిక స్థితి సరిగా లేని ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన ఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. వివరాలివి.. భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన పాల బంగార్రాజు(62) భార్య అప్పలకొండమ్మ నాలుగు మాసాల క్రితం మరణించింది. అప్పటి నుంచి మానసిక స్థితి సరిగా లేని ఆయన, కుమార్తె తుపాకుల హేమలత ఇంటి వద్ద ఉంటున్నాడు. గతంలో ఇదే విధంగా నాలుగు సార్లు ఇంటి నుంచి వెళ్లిపోయిన బంగార్రాజు ఈ నెల 13న కుమార్తె ఇంటి నుంచి మళ్లీ వెళ్లిపోయాడు. దీంతో కుమార్తె భీమిలి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

రెండోవార్డులో మహిళ..



మాధవీలత (ఫైల్)

జీవీఎంసీ రెండోవార్డు కుమ్మరి వీధికి చెందిన కొప్పాక మాధవీలత (33) ఈ నెల 10వ తేదీన సాయంత్రం 4 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. రెండేళ్ల నుంచి మానసిక స్థితి సరిగా లేని ఆమె ఏడాది క్రితం కూడా ఇలాగే వెళ్లిపోగా.. ఒడిశాలోని బరంపురం పోలీసులు ఈమెను గుర్తించి, భీమిలి పోలీసుల ద్వారా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆమె మళ్లీ వెళ్లిపోవడంతో సోదరుడు వెంకట శ్రీధర్ భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.